ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 13

సాయి - సాంప్రదాయము

ఇహపర శ్రేయస్సు చేకూర్చే జీవిత విధానమే ధర్మం. సృష్టి - మానవుల తత్త్వమెరిగిన మహనీయులు అన్ని దేశాలకూ తగిన ధర్మం బోధించారు. ప్రకృతిలో ప్రతి దానికీ వృద్ధీ - క్షయము - పునరుద్ధరణ సహజమైనట్లే, ధర్మానికి గూడ సహజం. కాలక్రమేణ ధర్మంలో మూఢాచారాలు చోటుచేసుకొనడంవలన మతద్వేషాలేర్పడ్డాయి. అందుకే ప్రతి యుగంలోవలెనే యీ యుగంలోగూడ నిజమైన ఆధ్యాత్మిక ధర్మం తెలిపి మూఢాచారాలు తొలగించడానికి బాబా అవతరించారు. శ్రీకృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదులవలెనే ఆయన మనకు ధర్మం తెలిపారు.

ఒక పేద బ్రాహ్మణుడు బాబాను ధనసహాయం కోరాడుగాని, లోలోపల ఆయన ముస్లిమనే శంకగూడ వున్నది. మొదట కొంతసేపు సాయి పట్టించుకోలేదు గాని, చివరికొక కాగితపు పొట్లమిచ్చి, "దీనిని యింటికి తీసుకుపోయి నువ్వు, బిడ్డలూ తినండి. దారిలో విప్పి చూడవద్దు" అన్నారు. అతడు తన ఊరికి బయలుదేరాడు. పోను పోను కుతూహలమెక్కువై చివరికొక కాలువ గట్టు చేరి, ఆ పొట్లం విప్పి చూచాడు. అందులో పొట్టేలు మాంసమున్నది. వెంటనే దానిని కాలువలో పారేశాడు. నీటికి తగులగానే ఆ మాంసం బంగారంగా మారి, చూస్తుండగా మునిగిపోయింది. అతడు నిరాశగా తన పైపంచ ఆ కాలువలో పిండుకున్నాడు. అపుడందులో ఒక సన్నని బంగారుపోగు కన్పించింది. సద్గురువు యొక్క వేష భాషలు పట్టించుకోక, ఆయనను విశ్వసించినవాడే కృతార్థుడౌతాడు.

నిత్య జీవితంలో మనోనిగ్రహం సాధించినవారికి మాత్రమే ఉపవాసం యింద్రియనిగ్రహం సాధించడానికి పనికొస్తుంది. మిగిలినవారికి ఉపవసించినపుడు రుచుల మీదకు మనస్సు పోతుంది గనుక వ్యర్థమేగాక, అనర్థం గూడ. అందుకే సాయి తన భక్తులను ఉపవసించనిచ్చేవారుగాదు. ఒకరోజు దాదా కేల్కర్‌తో ఆయన, "ఇపుడు 'సిమోగా' పండుగలు కదా, బిడ్డలను ఉపవసించనివ్వము!" అన్నారు. ఆయనమాటలెవరికీ అర్థంగాలేదు. కొద్దిసేపట్లో శ్రీమతి గోఖలే శిరిడీ చేరి, కేల్కర్ ఇంట్లో సామానుపెట్టి మశీదు చేరింది. అప్పుడు సాయి నెమ్మదిగా, "ఈ ఉపవాసము, తపవాసము ఎందుకు? దాదా కేల్కర్ యింటికి వెళ్ళి పోళీలు చేసి మనం తినాలి. దాదాకు, అతని బిడ్డలకు పెట్టాలి!" అన్నారు. సరిగ్గా అదే సమయంలో కేల్కర్ భార్య బహిష్టు అయింది. ఇంట్లో వంటచేసే వారెవరూలేరు. కనుక శ్రీమతి గోఖలేనే ఆ యింట్లో వంటచేసి, ఆ కుటుంబానికి పెట్టి తినవలసివచ్చింది. నిజానికి ఆమె మొదట శిరిడీ వెళ్ళి సాయి సన్నిధిలో 3 రోజులు ఉపవసించాలనుకున్నదట!

ఒకసారి దీక్షిత్ యావజ్జీవితమూ రాత్రి ఉపవసించాలని నిశ్చయించుకున్నాడు. నాటి సాయింత్రం అతడు మశీదు చేరగానే సాయి, "రాత్రి భోజనానికి ఏమి చేయిస్తావు?" అన్నారు. "మీరేది చేయించమంటే అది!" అన్నాడు దీక్షిత్. "మామూలే! రొట్టెలు, కూర చేయించి, అక్కడే నైవేద్యం పెట్టి, నీవూ తిను" అన్నారు బాబా. "బాబా, ఈరోజు అలానే చేస్తాను. రేపటినుంచీ నేను రాత్రి భోజనం చేయను" అన్నాడు దీక్షిత్. బాబా అప్పుడేమీ మాట్లాడలేదు

గాని, రోజూ సాయంత్రం అలానే హెచ్చరిస్తున్నారు. అంతటితో ఆ నియమం మానుకున్నాడు దీక్షిత్.

ఒకరోజు అందరూ ఆరతికి మసీదుకు వెళ్ళినపుడు బల్వంత్‌నాచ్నేను వెళ్ళి భోజనం చెయ్యమన్నారు బాబా. ఆరోజు ఏకాదశి. సాటి భక్తులిద్దరూ ఉపవసిస్తుంటే తాను తినడం బాగుండదని, అతడారోజు భోజనం చెయ్య నన్నాడు. నిజానికి అతడెన్నడూ ఉపవసించడు. బాబా అతని సహచరులను చూపి, "వీరు పిచ్చివాళ్ళు, నీవైనా వాడాకుపోయి భోజనం చేసిరా!" అన్నారు. వంటవాడు చికాకుపడి, ఆరతి అయితేగాని భోజనం పెట్టనన్నాడు. నాచ్నే మశీదు చేరగానే "భోజనం చేశావా?" అన్నారు బాబా. అతడు జరిగినది చెప్పక, ఆరతి అయ్యాక తింటానన్నాడు. బాబా పట్టుదలగా, 'భోజనమయ్యాకనే ఆరతి జరుగుతుంది!" అన్నారు. వంటవాడు వడ్డించక తప్పలేదు. భోజనం తర్వాత నాచ్నేచేత తాంబూలం తినిపించారు బాబా.

శ్యామా తరచుగా, "ద్వారకలో యాభైకోట్లమంది యాదవులుండే వారని, రామునికి యుద్ధంలో సహాయంగా కోటిమంది వానరులొకచోట చేరారనీ వ్రాశారు. అది నిజమేనా?" అని అడిగితే సాయి, "ఆఁ నిజమే! రాముడు, కృష్ణుడు అవతరించినది గూడ నిజమే, వారంతా చీమలపుట్టల్లా ఒకరిపైనొకరు చేరారు" అన్నారు. అతడు, "చూచినట్లే చెబుతున్నారే!" అంటే ఆయన, "అవును, చూచాను. నాకు, నీకూ ఎన్నోజన్మలు గడిచాయి. నాకన్నీ గుర్తున్నాయి. నీకులేవు. ఇప్పుడెలా వున్నానో అప్పుడూ అలానే వున్నాను" అన్నారు. మరోసారి యితడే బ్రహ్మాలోకము మొ॥వి వుంటే తనకు చూపమని పట్టుబట్టాడు. భగవంతుని ముందు అవి అల్పాలని, అశాశ్వతములని, వాటిని పట్టించుకోవద్దనీ చెప్పినా అతడు వినలేదు. బాబా అతనిని కళ్ళు మూసుకోమన్నారు. అతనికి ఆయా లోకాలు కన్పిస్తుంటే బాబా సత్యలోకంలో బ్రహ్మను, వైకుంఠంలో విష్ణువును, కైలాసంలో శివుణ్ణి చూపి, "మనం కోరవలసినది వీటికతీతమైనది" అన్నారు.

నాగపూర్‌జిల్లాకు చెందిన భీష్మకు 1908లో ఒకరాత్రి కలలో ఒక నల్లని సద్బ్రాహ్మణుడు దర్శనమిచ్చి ఒక కాగితంమీద, "సచ్చిదానంద" అన్న మంత్రం చూపాడు. తర్వాత అతడొక సాధువును అడిగితే అది అతని సద్గురు నామమని చెప్పాడు. తర్వాత అతడు శిరిడీ వచ్చినపుడు సాయి అతనిని చూస్తూనే నవ్వి, "జై సచ్చిదానంద!" అన్నారు. అతనాశ్చర్యపోయి తనకు స్వప్న దర్శనమిచ్చిన గురువు వీరేనేమోననుకున్నాడు గాని, వారు వైష్ణవులు, సాయి ముస్లిము గదా అని శంకించాడు. ఒకరోజు సాయి, "మేమే సర్వత్రా సంచరిస్తున్నాము. బొంబాయి, పూణే, నాగపూర్ మొ॥న ప్రదేశాలన్నీ రామమయమే, తెలిసిందా మిత్రమా? నీవు 5 లడ్డూలివ్వాలి" అన్నారు. మరురోజు తెల్లవారగానే అతని హృదయంలో కవిత పెల్లుబికి వెంటనే రెండు పాటలు వ్రాశాడు. కాని, ఆపై ఒక్కటిగూడ నడవలేదు. వాటిని సమర్పించగానే, సాయి అతనినే పాడి విన్పించమన్నారు. అతడు పాడాక అతని తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు. అతనికి మళ్ళీ స్ఫూర్తిగలిగి, మరి మూడు పాటలు వ్రాసి ఆయనకు వినిపించాడు. అవే మొదటి శిరిడీ ఆరతులు. **సాయి యిలా కోరి, తమ తపశ్శక్తి ధారపోసి వ్రాయించుకుని దక్షిణగా తీసుకున్నవి.** తర్వాత దాసగణు, మాధవ్‌లు మరి కొన్ని పాటలు చేర్చి నేటి శిరిడీ ఆరతులు కూర్చారు. అందుకే భావమెరిగి వాటిని పాడుకొనడమెంతో శ్రేయస్కరం.

మన శాస్త్రాలను బాబా చక్కగా వివరించారు. శ్రోత్రియుడు నానాచందోర్కర్, తనకు భోజన సమయంలో తరచుగా అతిథులు దొరకడం లేదన్నాడు. బాబా అన్నారు: "నానా, శాస్త్రాల్లో పొరబాటేమీ లేదు. వాటిని నీవే సరిగా అర్థం చేసుకోలేదు. అతిథి అంటే మానవుడేగాదు, భోజన సమయానికి వచ్చిన ఏ ప్రాణియైనా అతిథే, క్రిమికీటకాదుల నుండి మానవులవరకూ నిజంగా లభించిన అతిథులను నువ్వు గుర్తించడం లేదు. కాకబలికి బయట సమృద్ధిగా అన్నం విడిచిరా. ఏ ప్రాణినీ పిలువవద్దు, తరమవద్దు. ఏ ప్రాణి వచ్చిందన్నది పట్టించు

కోవద్దు. అలా చేస్తే లక్షలాది అతిథులను ఆదరించినట్లే. "

ఏ విషయంలోనైనా కొంతవరకూ జాగ్రత్త అవసరమే, సహజమే కాని సర్వానికీ కర్త భగవంతుడేనని, సద్గురు అనుగ్రహాన్ని మించినదేదీ లేదన్న సత్యాన్ని అది మరిపించకూడదు. అది పిరికితనంగా, మూఢనమ్మకంగా మారగూడదు. ఒకప్పుడు శిరిడీ పరిసరాలలో కలరా వ్యాపించింది. ప్రక్క గ్రామాలతో సంబంధం లేకుండా ఆ గ్రామస్తులు జాగ్రత్తపడ్డారు. మంచిదే, కాని ఊరిలోకి కట్టెల బండి ప్రవేశించడం అశుభమని నమ్మి, నిషేధించి, దానిని ఉల్లంఘించిన వారికి జరిమానా ప్రకటించారు. ఇంతలో ఆ ఊరు సమీపించిన కట్టెలబండిని సాయియే పిలిచి, మశీదులో ధునికి కట్టెలు వేయించారు. ఎవరూ ఆయనకు ఎదురు చెప్పలేదు.

ధర్మం ఉల్లంఘించమని సద్గురువెన్నడూ చెప్పడు. మనకు ధర్మ సూక్ష్మం అర్థంగాక అలా అనిపించవచ్చు. శాస్త్ర వాక్యాన్ని విడచి ఆయన ఆజ్ఞనే పాటించమని ధర్మశాస్త్రము, ఆధ్యాత్మ విద్య చెబుతాయి. కారణం, ధర్మాలన్నీ సద్గురు కృపను ప్రసాదించేవే. అయితే ఆయన యందు దృఢ విశ్వాసమున్నవారికే ఉత్తమ ఫలితం లభిస్తుంది. సద్గురువును తాము పూర్ణంగా విశ్వసించామని భ్రమించి, ఆయన తమను కరుణించలేదని భక్తులు వాపోతారు. అందుకని అప్పుడప్పుడు సద్గురువు వారి విశ్వాసమెంతటిదో వారికి నిరూపిస్తుంటారు. ఒకరోజు ఒక కృశించిన ముసలిమేక మసీదులోకి వచ్చింది. బడేబాబాను పిలిచి, "నీవు ఆ మేకను ఒక్క దెబ్బతో నరుకు!" అన్నారు సాయి., అది తన వల్లగాదని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు బడేబాబా. శ్యామాను పిలచి, రాధాకృష్ణ ఆయి వద్ద నుండి కత్తి తెచ్చి ఆ మేకను నరకమన్నారు సాయి. ఆమె మొదట తెలియక కత్తి పంపిందిగాని, ఎందుకో తెలిసి తిరిగి తెప్పించుకున్నది. శ్యామాగూడ వేరొక కత్తి తెస్తానని వెళ్ళి తిరిగిరాలేదు. సాయి అలానే దీక్షిత్‌ను ఆజ్ఞాపించారు. అతడు కత్తి తెచ్చాడు. కాని సాయి కేవలం తన భక్తిని పరీక్షిస్తున్నారని తలచి వెనుకాడుతుంటే, మేకను నరకమని ఆజ్ఞాపించారు. సరిగ్గా అతను నరకబోయే సమయానికి వారించి, "దానిని విడిచిపెట్టు. నేనే చంపుతాను. కాని, మశీదులో కాదు" అన్నారు సాయి. ఆ మేక కొన్ని అడుగులు బయటకు నడచి, చచ్చి క్రిందపడింది.

దాదాకేల్కర్ ఆచారపరుడు. ఒకప్పుడతనికి పైకమిచ్చి మాంసము తెమ్మన్నారు బాబా. ఆ సద్బ్రాహ్మణుడు నిస్సంకోచంగా బయలుదేరాడు. అప్పుడు సాయి అతనిని వారించి మరెవ్వరినైనా పంపమన్నారు. తరువాత అసలు మాంసమే అవసరం లేదన్నారు! మరొకప్పుడు ఆయన వంట చేస్తూ అతనిని పిలిచి, "మాంసపు పలావ్ ఎలా వున్నదో చూడు!" అన్నారు. అతడు చూడకుండానే, "బాగానే వున్నది" అన్నాడు. "చూడకుండానే బాగుందంటావేం? మూత తీసి చూడు!" అంటూ సాయి అతని చేతిని గుండిగలోనికి తోసి, "గరిటతో కొంచెం పళ్ళెంలో వేయి, ఆచారం గురించి భయపడకు!" అని అతనిని ప్రేమగా గిల్లారు.

ఇటువంటి విషయాలలో సాయి ముస్లిమ్ భక్తులను కూడ విడిచిపెట్టలేదు. ఒక ముస్లిం తనకు సంతానం కల్గితే శిరిడీలో మిఠాయి పంచుతానని మ్రొక్కుకున్నాడు. అతని కోరిక ఫలించింది. అతడు శిరిడీ చేరి మిఠాయి పంచటానికి బాబా అనుమతి కోరాడు. ఆయన నవ్వి మారుతి ఆలయంలో పంచమన్నారు. అతడు నివ్వెరబోయి, "నేను ముస్లిమ్‌ను గదా అదెలా సాధ్యం?' అన్నాడు. బాబా నవ్వుతూ, "ఇటీవల వారికి జరిగిన యుద్ధంలో మారుతి అల్లాహ్‌ను ఓడించాడు!" అని, ఉగ్రులై, "ఏం ముస్లిమ్‌వురా నీవు! ఆలయంలో మిఠాయి పంచుపో!" అని గద్దించారు. సర్వగతుడైన భగవంతునిపై భక్తికి మతభేదం ఆటంకంగాదని వారి భావం. అతడు బాబా ఆజ్ఞను పాటించాడు.

నైజాం రాష్ట్రానికి చెందిన ఒక ముస్లిమ్‌మత ప్రముఖుడు (హాజీ) శిరిడీ వచ్చి, మసీదులో అగ్నిహోత్రము,

గంటలు మొ॥వి వుంచటం గురించి బాబాతో, "ఇది ముస్లిమ్‌లైన మీకు తగదు. అల్లాహ్ మిమ్ము సహించడు". అన్నాడు. సాయి ఉగ్రులై, "నీవు అసలు ముస్లిమ్‌వేనా? నీకు 'నమాజ్', 'షరియత్' (ఇస్లాం ఆచార ఖాండ), ఖురాన్‌లు తెలుసా? ముస్లిమ్‌లు మాత్రమే దేవునిచేత సృష్టింపబడ్డారా? తక్కినవారిని ఎవరికైనా జీతానికి అప్పగించారా? వారి చావు పుట్టుకలు, ఆకలి దప్పులలో ఏమైనా భేదమున్నదా? అసలైన ఇస్లాం నాకు తెలుసు! భగవంతుని శక్తిని ఋజువు చేయగలవాడే ముస్లిమ్" అన్నారు. ఆ ఖాజీ సాయంత్రం వరకూ మౌనంగా మశీదు ముంగిట పచార్లుచేసి, బాబాకు మోకరిల్లి తనను అనుగ్రహించమని కోరాడు. అతనిని 3, 4 రోజులు తమదగ్గ రుంచుకొని ఆశీర్వదించి పంపారు బాబా. ధర్మాచరణ, భగవంతునికి శరణాగతి మాత్రమే 'ఇస్లాం' ధర్మమని 'ఖురాన్' చెబుతుంది.

సాయి మతమౌఢ్యాన్ని నిరసించేవారు. భక్తులాయనను మొదట పూలతో మాత్రమే పూజించేవారు. ఒక్క మహల్సాపతి మాత్రమే ఆయన కంఠానికి చందనమద్దేవాడు. ఒకనాటి రాత్రి అతనికి స్వప్నంలో ముఖానికి చందనం ధరించి సాయి దర్శనమిచ్చారు. మరురోజునుండి అతడు సాయిని అలానే అలంకరించ సాగాడు. అతనిని వారించమని ముస్లింలు కోరినా ఆయన అభ్యంతరం చెప్పలేదు. వారిలో కొందరు సంగమనేరులోని ఖాజీతో సంప్రదించి, సాయి ముఖాన చందనమద్దినవారిని దండించదలచారు. మొహుద్దీన్ తంబులీ ఆ విషయం మహల్సాపతికి చెప్పాడు. మరురోజతడు మసీదు ముంగిటనుంచే సాయిని పూజిస్తున్నాడు. సాయి అతనిని, "లోపలకొచ్చి నా ముఖాన చందనమద్దు, ఎవరడ్డొస్తారో చూస్తాను!" అని గద్దించారు. ఆ ముస్లింలు భయపడి వెళ్ళిపోయారు. హిందువులు నిర్భయంగా తమ మతానుసారం సాయిని ఆరాధించసాగారు.

వేరు మతాలవారికి దైవం వేరైతే, మతం మార్చుకోవడం ద్రోహము, లజ్జాకరము. దైవమొక్కడే అయితే మతం మార్చుకొనడం అనవసరము. ఒక హిందూ యువకుణ్ణి ముస్లింగా మార్చి, గర్వంగా బాబాకు చూపాడు బడేబాబా. సాయి ఉగ్రులై, ఆ యువకుని చెంపమీద కొట్టి, **"నీ అబ్బను మార్చుకున్నావుట్రా?"** అన్నారు.

హిందువులు తమ మతాచారాలతో మశీదును అపవిత్రం చేస్తున్నారని తలచాడు ఒక పఠాను. ఒకనాటి రాత్రి చావడిలో పడుకున్న సాయి చెంతకు వెళ్ళి, అక్కడ నిద్రిస్తున్న హిందువులను చూపుతూ, 'మీరు అనుమతిస్తే మశీదును అపవిత్రం చేస్తున్న వీరందరినీ యిప్పుడే చంపేస్తాను!" అన్నాడు. సాయి శాంతంగా, "ఇందులో తప్పేదైనా వుంటే అది నాదే. వారందరినీ చంపేకంటే నన్నే చంపుతే సమస్య తీరుతుంది!" అన్నారు. అతడు నివ్వెరపోయి, ఆ సంకల్పము విడిచాడు. కాని మరొక పఠాను అందుకు గూడ సిద్ధమయ్యాడు. ఒకరోజు సాయి మశీదులో అటు, యిటూ తిరుగుతున్నారు. ఇతడు చేతిలో దుడ్డుకర్ర తీసుకుని వెనుకనుండి వచ్చి సాయిని కొట్టబోయాడు. అతడు కర్ర యెత్తిన క్షణంలో ఆయన అతనివైపు తీవ్రంగా చూసి అతడి చేయి తాకారు. అదేమీ చిత్రమో, అతడి బలమంతాపోయి, కుప్పకూలాడు. నాటితో అతడా సంకల్పం విడిచాడు. ఇలాటి ముస్లిమే మరొకడు హిందువులను భ్రష్టులను చేయదలచి, బాబా లెండీకి వెళ్ళినపుడు మశీదులోని మంచినీటి కుండలలో తాను త్రాగిన నీళ్ళు కలిపాడు. ఇంతలో బాబా తిరిగి వచ్చి, ఆ నీళ్ళు పారబోసి, కుండలు పగలగొట్టి, పెద్దగా తిట్టారు.

హిందూ భక్తులకువలే, పాత్రులైన ముస్లిమ్‌లను గూడ సంస్కరించి అనుగ్రహించేవారు సాయి. ఎన్నోసార్లు మక్కాయాత్ర చేసిన ఒక ముస్లిమ్ హాజిసిద్ధిక్ సాల్కే శిరిడీ వచ్చాడు. అతనిని చూస్తూనే బాబా ఉగ్రులై రెండు నెలల వరకూ అతనిని మశీదులో ప్రవేశించనీయలేదు. ఒకరోజు శ్యామా అతని తరపున ప్రార్థిస్తే, "ఆ హాజీ బార్వే బావిదగ్గరకు సన్నని కాలిబాటన వస్తాడా?" అన్నారు బాబా. హాజీని అడిగితే అతడు వస్తానన్నాడు. అది విని సాయి, "నాలుగు వాయిదాలలో రూ. 40,000లు చెల్లిస్తాడా?" అన్నారు. శ్యామా అడిగివచ్చి, అతడు 40 లక్షలైన

యివ్వడానికి సిద్ధమేనని చెప్పాడు. ఈసారి ఆయన, "మేమొక మేకను కోస్తాము. అతడికి తల, పిరుదులు, వృషణాలు, యేది కావాలో కనుక్కో!" అన్నారు. "బాబాగారి మట్టికుండలోని చిన్న రొట్టెముక్క చాలు" అని కబురు చేశాడు హాజీ. అది విన్న సాయి పట్టరాని ఆవేశంతో మసీదులోని పాత్రలన్నీ బయటపారేసి, కఫ్నీ చేతులు పైకి మడుచుకొంటూ, కోపంగా హాజీవద్దకొచ్చి, "ఇక్కడున్నది ఎవరనుకున్నావ్? మక్కాయాత్ర చేశానని గర్వమా? ఖురాన్ అలా చెప్పిందా? ఇంతా చేసి నీవు నన్నెరుగవు!" అన్నారు. హాజీ భయంతో వణికిపోయాడు. బాబా మసీదుకు తిరిగివచ్చి తమ వద్దనున్న పైకంతో పండ్లుకొని హాజీకి పంపి, రూ. 50/-లు కూడ యిచ్చారు. నాటినుండి అతడు మసీదు ప్రవేశించటానికి సాయి అనుమతించారు. ఆయన చెప్పిన మేక శరీరంలోని భాగాలు ధర్మార్థకామాలు; హాజీ కోరినది సాయి నిత్యమనుభవించే మోక్షం. 'సాయి పాత్రలోని చిన్న రొట్టెముక్క' కోరడంలో హాజీ గురూచ్ఛిష్ఠం కోరాడు; సాయి చెప్పిన కాలిబాట కఠోరమైన సాధన. రూ. 40,000/-లు అంతఃకరణ చతుష్టయం; కాని అవి మొదట తాను హాజీననే గర్వంలో చిక్కుకున్నాయి. అతడు తమను శరణుపొందాకనే, సాయి కోపంతో అతని గర్వమణచడం సరియైన గురువుల పద్ధతి. అది నెరవేరగానే తమ సంతోషానికి సంకేతంగా సాయి పండ్లు, కానుక ప్రసాదించారు.

ఇలానే హిందువులను గూడ సంస్కరించారు సాయి. బల్వంత్‌నాచ్నే 1915లో ఒకనాటి రాత్రి 8 గంటలకు సాయిని దర్శించి ముక్తిమార్గం చెప్పమని ప్రార్థించాడు. "దేవ్‌పూర్ వెళ్ళి, అక్కడ అనాదిగా మీ పూర్వీకులు అర్చిస్తున్న శిలలను ఆశ్రయించు" అన్నారు సాయి. అతనికేమీ అర్థంగాలేదు. ఇంటికి వెళ్ళాక, నిజంగానే వారి పూర్వీకులు దేవపూర్‌లో కొన్ని విగ్రహాలను పూజించేవారని అతని తండ్రి చెప్పాడు. ఐదు తరాలకు ముందు వారి పూర్వీకుడు, బాబా ప్రయాగ్ తమ 70వ యేట సంతానం కోసం ఏకనాథుని శిష్యుడైన 'బాబా భాగవత్' అనే మహాత్ముని త్రయంబకేశ్వరంలో దర్శించాడు. ఆయన ఆశీస్సులతో కలిగిన పసిబిడ్డను దేవపూర్ తీసుకువెళ్ళి, 'జ్ఞానేశ్వరి' వ్రాతప్రతి చేతిలో పెట్టారు భాగవత్. వంశం నిలబడితే ఆ వంశస్థులు, భాగవత్ వంశస్థులనుండి ఉపదేశం పొందుతామని ఆ పూర్వీకుడు మొక్కుకున్నాడు. ఇదంతా సాయికి తెలియడమే ఆశ్చర్యం! అయినా చాలా సం॥రాలకు నాచ్నే 1927లో 'నానూమహరాజ్, అనే 15 సం॥ల మహాత్ముని దర్శించాడు. ఆయన, "దేవపూర్ వెళ్ళావా?" అన్నారు. నాచ్నే ఆశ్చర్యపోయి, "ఆ గురువంశంలో నాకంటె పెద్దలెవరూ లేరని వెళ్ళలేదు" అన్నాడు. "అయితేనేం? నా గురువు శ్రీదోయ్‌పోడే నాకంటే చిన్నవారు. నీ గురువు పేరు భాగవత్" అన్నారు ఆ మహాత్ముడు. నాచ్నే త్వరలో దేవపూర్ వెళ్ళి ఉపదేశం పొందాడు. సంవత్సరం తరువాత 'నానూ మహరాజ్' బొంబాయి వస్తున్నారని అతనికి తెలిసి స్టేషన్‌కు వెళ్ళాడు నాచ్నే. 'నానూ మహరాజ్' అతనికి తమ గురువైన 8 సం॥లు 'శ్రీపాద దోయ్‌పోడే' గారిని చూపారు. తర్వాత ఈ శ్రీపాదులు కొంతకాలం గుంటూరులో మెట్రిక్ చదివారట.

★★★